క్లుప్తంగా

వృద్ధుడికి ఆర్థిక సాయం

మంగళగిరి: అనారోగ్యానికి గురైన వృద్ధుడు భవిరిశెట్టి వెంకటేశ్వరరావు వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అందించిన రూ.10వేల సాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

మోదీ పాలనపై కరపత్రాలు పంపిణీ

తాడేపల్లిరూరల్: ప్రధాని నరేంద్రమోదీ సుపరి పాలన, పేదల సంక్షేమం కార్యక్రమంలో భాగంగా నులకపేట, ఇండస్ట్రియల్ కాలనీ తదితర ప్రాంతాల్లో బీజేపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు కాకుమాను భాగ్యేశ్వరరావు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్ మాట్లాడారు.

బీజేపీ విధానాలు ఆందోళనకరం



తాడేపల్లిరూరల్: బీజేపీ అవలంబిస్తున్న విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు షేక్ సుభాని పేర్కొన్నారు. ఆదివారం దుగ్గిరాల గ్రామంలోని ముర్తుజానగర్ జెండా చెట్టు వద్ద కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూనిఫాం సివిల్ కోడ్ చట్టాన్ని దేశంలో ప్రవేశపెట్టాలని చూస్తోందని ఆరోపించారు. తద్వారా రాజ్యాంగం ప్రసాదించిన ఎవరి మతాన్ని వారు ఆచరించే హక్కును కాలరాయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షేక్ రషీద్, పఠాన్ మస్తాన్, షేక్ జాను, షేక్ ఆయూబ్, షేక్ షీయాలి, షేక్ ఫైరోజ్, షేక్ జాన్ షైదా, మహమ్మద్ బర్రుజమా పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపైనున్న కార్మెల్‌మాతకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే పలు ప్రాంతాల నుంచి వాహనాలు, రైళ్లలో వచ్చిన భక్తులు కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్‌మాతను దర్శించుకొని కొవ్వొత్తులు వెలిగించి , కొబ్బరికాయలు కొట్టి ప్రార్థనలు చేశారు.

కోదండరామాలయంలో సుదర్శన హోమం

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలోని కోదండరామాలయంలో ఆదివారం సుదర్శనహోమం నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి విశేష అర్చనలు అర్చకులు కృష్ణమూర్తి నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, మండపారాధన , కలశ పూజలు చేసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాలలో నవగ్రహ, సుదర్శన, లక్ష్మీగణపతి హోమాలను రుత్వికులు నారాయణం గోవర్ధన రఘురామ్, సాయి, అజయ్‌కుమార్, వినయ్‌కుమార్ నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్ర నామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

యర్రబాలెంలో రూ.500 నకిలీ నోటు కలకలం



మంగళగిరి: ఇటీవల మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో నకిలీ నోట్లు చలామణి అవుతుండటంతో వ్యాపారస్తులు లబోదిబోమంటున్నారు. రద్దీగా ఉండే దుకాణాలు, హోటళ్లు, సూపర్ మార్కెట్లతో పాటు పలు పెట్రోలు బంకుల్లో నకిలీ నోట్లను కొందరు చలామణి చేస్తూ దందా సాగిస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి. తాజాగా కార్పొరేషన్ పరిధి యర్రబాలెంలో ఆదివారం ఆంథోని మటన్ షాప్ నిర్వాహకురాలికి ఓ గుర్తు తెలియని వ్యక్తి రూ.500 నకిలీనోటు ఇచ్చి మటన్ తీసుకుని వెళ్లిపోయాడు. వ్యాపారం ముగిసిన అనంతరం నగదు లెక్కించే క్రమంలో మటన్ దుకాణం నిర్వాహకురాలి కుమారుడు శ్రీకాంత్ రూ.500 నోటు నకిలీదిగా గుర్తించాడు. గత ఆదివారం కూడా ఓ గుర్తు తెలియని వ్యక్తి మటన్ తీసుకుని ఇచ్చిన నగదులో రూ.100 నకిలీనోటు వచ్చిందని వాపోయాడు.

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణను అడ్డుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంలోని కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఆదివారం సహా సెలవు రోజుల్లో యథేచ్ఛగా విద్యార్థులకు తరగతుల నిర్వహణ కొనసాగుతోందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాయిచరణ్ గుప్తా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో సైతం విద్యార్థులకు సెలవు ఇవ్వకుండా తరగతుల నిర్వహణపై ఇంటర్‌బోర్డు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లక్ష్మీపురం, చంద్రమౌళీనగర్‌లోని వివిధ కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విషయమై ఆర్‌ఐఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

పలు గ్రామాల్లో గ్రావెల్ రోడ్ల నిర్మాణం

సొంత ఖర్చులతో చేపట్టిన ఎమ్మెల్యే ఆర్కే



తుమ్మపూడిలో ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధులతో నిర్మిస్తున్న గ్రావెల్ రహదారులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సొంత నిధులతో పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టారు. దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎప్పటి నుంచో రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలం వస్తే పలు శ్మశాన వాటికల్లో మృతి చెందిన వారిని ఖననం, దహనం చేసేందుకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే అధికారులను పిలిపించి రహదారుల వివరాలు, శ్మశాన వాటికల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు టెండర్లు పిలవడానికి సమయం పట్టడంతో ఎమ్మెల్యే ఆర్కే చొరవ చూపించి తన సొంత డబ్బుతో పలు గ్రామాల్లో రోడ్లను నిర్మిస్తున్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు, చింతలపూడి, తుమ్మపూడి, నల్లమేకల వారి పాలెం, గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే హిందూ, క్రిస్టియన్, ముస్లిం బరియల్ గ్రౌండ్లలో తన సొంత నిధులతో గ్రావెల్ ఫిల్లింగ్ చేసి మెరక తోలించారని మిగిలిన గ్రామాల్లో కూడా రహదారులు నిర్మించడం జరుగుతుంది.

వస్త్ర ఉత్పత్తి కులాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

నేతనాడు రాష్ట్ర అధ్యక్షుడు కొసనం శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న నేతనాడు రాష్ట్ర అధ్యక్షుడు కొసనం శ్రీనివాసరావు

మంగళగిరి: వస్త్ర ఉత్పత్తి కులాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని నేతనాడు రాష్ట్ర అధ్యక్షుడు కొసనం శ్రీనివాసరావు అన్నారు. నేతన్నల సామాజిక న్యాయ పాదయాత్ర ప్రారంభం సందర్భంగా నగరంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పద్మశాలీ, దేవాంగ, తొగటవీర, క్షత్రియ, కర్ణిబత్తుల, తదితర వస్త్ర ఉత్పత్తి కులాల వారిని ఐక్యం చేయాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. వస్త్ర ఉత్పత్తి కులాలకు 15 అసెంబ్లీ సీట్లు, నాలుగు మంత్రి పదవులు, మూడు లోక్‌సభ సీట్లు, రెండు రాజ్యసభ సీట్లు, 10 ఎమ్మెల్సీలతో పాటు స్థానిక సంస్థల్లో నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాదయాత్ర వస్త్ర ఉత్పత్తి కులాలు సంఖ్యా బలం ఉన్న నియోజకవర్గాల్లో కొనసాగుతుందని, ఒక్కో నియోజకవర్గంలో వారం నుంచి పది రోజుల పాటు డిసెంబరు 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పద్మశాలీయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాసరావు, రామనాథం వెంకటేశ్వరరావు, కొసనం సాంబశివరావు, దీపాల కావేరి, గుంటి ప్రతాప్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ప్రగడ నవదుర్గా ప్రసాద్, జింకా రఘువీర్, జింకా రామ్మోహన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యంపై అపోహలు వద్దు

పౌరసరఫరాల శాఖ డీటీ దుర్గారావు

మంగళగిరి: అందరికీ మెరుగైన ఆరోగ్యం కోసం బలవర్థక(ఫోర్టిఫైడ్) బియ్యాన్ని పంపిణీ చేయడం జరుగుతుందని, రేషన్ బియ్యంపై ప్రజలు ఎటువంటి అపోహలు చెందవద్దని పౌరసరఫరాల శాఖ డీటీ దుర్గారావు అన్నారు. రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఆనవాళ్లు అంటూ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో కథనాలు రావడంతో ఆయన స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా మొబైల్ వాహనాలు వినియోగించి కార్డుదారులందరికీ పోషక బియ్యం ఇంటి ముంగిట పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఫోర్టిఫైడ్ బియ్యం వండటానికి ప్రత్యేక వంటక విధానాలు అవసరం లేదని, సాధారణ బియ్యాన్ని ఎలా కడిగి శుభ్రం చేసుకుంటారో అదే విధంగా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కడిగి శుభ్రం చేసుకోవాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కడిగే సమయంలో ఒకవేళ బియ్యపు గింజలు నీటిపై తేలినట్లయితే వాటిని తీసివేయరాదని, గంజి తీయకుండా ఉడక నివ్వాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం అత్యుత్తమ పోషకాలతో కూడిన బియ్యం అని, ఆహారం యొక్క నాణ్యతను పెంచడానికే లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అన్ని వయసులు కలిగిన వారు వండుకుతిని మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చునని డీటీ దుర్గారావు తెలిపారు.

శ్మశానవాటికకు వాహనం అందజేత



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా తదితరులు

పట్నంబజారు: ఒక చెట్టు నాటితే జీవితాంతం నీడనిస్తుందని..ఒక స్వచ్ఛంద సంస్థ ఎంతో మందికి సేవనందిస్తుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. పాతగుంటూరులోని హిందూ శ్మశాన వాటికకు మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శాంతి వాహనం (మార్చురీ వాహనం) అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ శ్మశాన వాటిక అభివృద్ధికి శంకుస్థాపన చేయటంతో పాటు, నిధులు కూడా కేటాయించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే రీతితో శ్మశానవాటికను తీర్చిదిద్దుతామని చెప్పారు. పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మొహమూద్, యర్రి సాయి, సంస్థ సభ్యులు వజ్రాల వెంకటనారిరెడ్డి, రమేష్, రామారావు, గురవారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు సుబ్బారెడ్డి, సుబ్బులు, ఆదినారాయణరెడ్డి, పాపారావు పాల్గొన్నారు.

విద్యార్థులను చేర్పించేందుకు యూటీఎఫ్ ప్రచారం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆదిలక్ష్మి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం పేరుతో ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా, మండల కమిటీల సభ్యులు జిల్లా వ్యాప్తంగా ఆవాస ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, తల్లిదండ్రులను కలిసి పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించే విధంగా కార్యకర్తలు, ఉపాధ్యాయులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.
సంఘ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులతో సహజ సిద్ధ వాతావరణంలో మనోవికాస అభివృద్ధితో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలలకే సాధ్య మన్నారు. పాఠశాలలను కాపాడుకునే బాధ్యతలను తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు స్వీకరించినప్పుడు ప్రభుత్వ బడులకు ప్రత్యామ్నాయం ఉండ దని అన్నారు. ఆ విధంగా కృషి చేసి ప్రభుత్వ విద్యావ్యవస్థను పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గురుబ్రహ్మం, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

అవార్డులకు ప్రతిభే ప్రామాణికం కావాలి



రాధాకృష్ణమూర్తిని సత్కరించిన కలిమిశ్రీ, రాజేంద్రప్రసాద్

పాత గుంటూరు: అవార్డులు ఎవరికిచ్చినా ప్రతిభ ప్రామాణికంగానే ఇవ్వాలని, అవార్డు ప్రకటించాక దానిపై విమర్శలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా సంస్థలపైనే వుందని నటకంఠీరవ బిరుదాంకితులు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ హాలులో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో «కవి మిత్రుల కలయిక-కవి సమ్మేళనం» నిర్వహించారు. సభకు సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ కొత్తతరాన్ని ప్రోత్సహించకపోతే భవిష్యత్ తరాల సాహితీరంగమంతా శూన్యంగా మారే ప్రమాదముందన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ శ్యామ ఆంగ్ల పుస్తకాన్ని కందిమళ్ల శివప్రసాద్ తెలుగులో అనువదించగా, డాక్టర్ వంగిపురపు శారదాదేవి సమీక్షించారు. అనంతరం కవి సమ్మేళనంలో సొపాటి ప్రభాకర్, ఆళ్ల నాగేశ్వరరావు, రహీమ్ సాహెబ్, కారంచేటి విజయ్‌కుమార్, గోలి హనుమచ్ఛాస్త్రి, తాటికోల పద్మావతి, యక్కంటి పద్మావతి, మన్నం వెంకటగురువు, కొంతం నాగేశ్వరరావు, కె.లీలాకృష్ణ, బాబూ మస్తాన్, పింగళి భాగ్యలక్ష్మి, మండే సుబ్రహ్మణ్యంలు తమ కవితల్ని వినిపించారు. ఉత్తమ కవిత రాసిన మండే సుబ్రహ్మణ్యంను నగదు బహుమతితో సత్కరించారు. ముఖ్యఅతిథి రాధాకృష్ణమూర్తిని పుస్తకం అందించి, శాలువాతో సత్కరించారు. బండికల్లు జమదగ్ని పర్యవేక్షించారు.

తాడికొండ, కంతేరులో కొనసాగుతున్న పోలీస్ పికెట్



తాడికొండ: కంతేరు గ్రామంలో ఇరువర్గాలకు చెందిన యువకులు దాడులు చేసుకున్న నేపథ్యంలో పోలీస్ పికెట్ కొనసాగుతుంది. దళిత సంఘాలు పోలీస్ స్టేషన్‌కు ముట్టడి స్తామని ప్రకటించిన నేపథ్యంలో తాడికొండ పోలీస్ స్టేషన్, కంతేరు గ్రామంలో పికెట్ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంతేరు దాడి ఘటనలో ఆరుగురికి రిమాండ్

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలోని ఎస్సీ యువకులపై దాడి కేసులో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ రాంబాబు తెలిపారు. ప్రధాన నిందితుడు కళ్ళం మనోహర్ రెడ్డితో పాటు నంబూరు గ్రామానికి చెందిన జొన్నల నందీప్ రెడ్డి, అన్నపురెడ్డి సాయి కృష్ణారెడ్డి, కరాటి నాగేంద్ర బాబు, భీమవరపు మణిదీప్ రెడ్డి, ధనికొండ నరసింహారావులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞ మహోత్సవం ప్రారంభం



పాత గుంటూరు: సంపత్‌నగర్‌లోని శృంగేరీ శంకరమఠం శారదా పరమేశ్వరీ దేవస్థానంలో 108వ శ్రీ మద్భాగవత పారాయణ పూర్వక సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదమూర్తులు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు నిర్వహణలో గురువందనం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పరిషత్ రక్షాబంధనం, రుత్విగ్వరణం, కలశ స్థాపన, అఖండ దీపారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ మద్భాగవత మహత్యం పారాయణం ప్రారంభించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. వేదమూర్తులు మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటలకు గురువందనం, పారాయణ ప్రారంభం, 9 గంటలకు మద్భాగవత మహాపురాణ ప్రవచనం, 11 గంటలకు భాగవత పారాయణం జరుగుతుందని తెలిపారు. ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీ హరిప్రసాదరావు, పండితులు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రులు

పాత గుంటూరు: శ్రీనగర్ 6వ లైనులోని లలితా పరమేశ్వరి దేవస్థానంలో రాజశ్యామల పీఠం ఆధ్వర్యంలో వారాహి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. వారాహి అమ్మవారికి వివిధ ద్రవ్యాలతో కనుల పండుగగా అభిషేకం చేశారు. పుష్పార్చనలు, సహస్ర నామార్చనలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అమ్మవారి మూలమంత్రంతో వారాహి హోమం వేదోక్తంగా చేసారు. గణపతి, దుర్గ మంత్రాలతో హోమం జరిపారు. పీఠ వ్యవస్థాపకులు వెలమకన్ని నాగార్జున శర్మ మాట్లాడుతూ ఈ నెల 28 తేదీ పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సందీప్ శర్మ, వల్లూరి హనుమత్ సాయి. సన్నిధానం వ్యాసనారాయణ, అభిషేకాలు హోమం నిర్వహించారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి కదలి రండి

ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

తాడేపల్లిరూరల్: రైతాంగ సమస్యల పరిష్కారానికి జూన్ 30న విజయవాడలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో రైతు, కౌలు రైతుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ వివిధ ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టపోయిన రైతులందరికీ బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ పాడి రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన లీటరుకు రూ.4 రూపాయలు ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, అమ్మిశెట్టి సుబ్బారావు, బొడ్డు ప్రసాద్‌రావు, పులిగడ్డ సుబ్బారావు, అమ్మిశెట్టి నాగేశ్వరరావు, జవ్వాజి సత్యనారాయణ, ఎస్. రవికిషోర్, అమ్మిశెట్టి ఆదయ్య, మహిళా సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కొండపల్లి యశోద పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. నగరంలోని రత్నాల చెరువులోని సింహాద్రి శివారెడ్డి భవనంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, స్నిగ్ధ ఆయుర్వేద ఫౌండేషన్, గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో వైద్యులు అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్నిగ్ధ ఆయుర్వేద ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గోపాలన్ మాట్లాడుతూ ఆయుర్వేదం భారతీయ ప్రాచీన చికిత్స రూపంలో ఉందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు త్రిపురమల్లు సతీష్, క్లబ్ డైరెక్టర్లు తుల్లిమిల్లి రామకృష్ణ, వీసం వెంకటేశ్వరరావు, ప్రగడ రాజశేఖర్, నారిశెట్టి చంద్రశేఖర్, జొన్నాదుల భిక్షారావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ చైతన్య, డాక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం పేదలకు వరం

తాడేపల్లిరూరల్: పేదలకు వరం ఉచిత వైద్యశిబిరం అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనమంతరావు అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి మహానాడు ఓ ప్రైవేటు స్కూల్ ఆవరణలో మానవ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. మానవ సేవాసంస్థ నిర్వాహకులు వంగర సురేష్ మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో సుమారు 1600 మందికి ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. వైద్యులు వేణుగోపాల్ రెడ్డి, ప్రసాద్, హరీష్, మహేష్, రాకేష్, శ్వేత, ఆనంద్, నవీన్, రోజా, రవిబాబు, సుస్మిత, హరిత, వంశీ, శింగరి ప్రభాకర్, లాస్య సేవలందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్ రాజు, నాయకులు నరసింహారావు, మానవ సేవా సంస్థ సభ్యులు ఆదినారాయణ, రమేష్, రవి, శ్రీనివాస్, సుధాకర్, ప్రసాద్, నందగోవర్ధన్, ఏసురెడ్డి, వెంకటాద్రి, మహేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై అరుణహోమం



అరుణ హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వేద విద్యార్థులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం అరుణ హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళా శాసనాలతో ఆషాఢ మాసం సందర్భంగా ఉదయం 9 గంటలకు సూర్య భవానునికి అరుణ హోమం నిర్వహించినట్లు చెప్పారు. అరుణ హోమం సమస్త జీవకోటికి ప్రాణశక్తిని, వెలుగుని ప్రసాదించే సూర్యభవానునికి ప్రీతికరమని అన్నారు. వేదంలోని ఆరణ్యక భాగంలో ఉన్న 132 సూర్య మంత్రాలను ఉపాసిస్తూ ఆయల అర్చకులు, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వేద విద్యార్థులు హోమాన్ని పూర్తి చేశారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ అరుణ హోమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని వివరించారు.

ఉమ్మడి పౌరసత్వం దేశానికి శ్రేయస్కరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సోమసాని బ్రహ్మానంద రెడ్డి



మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి పౌరసత్వ చట్టం ద్వారా దేశం అనేక రంగాల్లో పురోభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సోమసాని బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. భారత వికాస్ పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో యూనిఫామ్ సివిల్ కోడ్ అంశంపై ఆదివారం సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య–సాధు సుబ్రహ్మణ్యం జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో సదస్సు నిర్వహించారు. భారత వికాస్ పరిషత్ గుంటూరు శాఖ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యాయవాది జూపూడి రంగరాజు మాట్లాడుతూ స్వాతంత్రానంతరం కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలతో ప్రజల మధ్య అంతరాలు ఏర్పడిన నేపథ్యంలో దివంగత ప్రధాని వాజ్‌పేయి ఉమ్మడి పౌరసత్వంపై రాజ్యాంగ సమీక్షకు సంకల్పించారని అన్నారు. కామన్ సివిల్ కోడ్ ద్వారా దేశ ప్రజల మౌలిక సామాజిక సమగ్రాభివృద్ధి కోరుకునే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం కలుగుతుందని తెలియజేశారు. ప్రముఖ సామాజిక, రాజకీయ విశ్లేషకులు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కరోనా దేశ ప్రజల నిర్భయత్వాన్ని మరింతగా పెంచిందన్నారు. ప్రధాని మోదీ సారధ్యంలో కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తు సవాళ్లను ముందుగానే గమనిస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళుతున్న వాస్తవాన్ని ప్రపంచ దేశాలు ఇప్పటికే గుర్తించాయని, ప్రజలు ఆ దిశగా రాజకీయాలకతీతంగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ బైరిశెట్టి మల్లికార్జునరావు మాట్లాడుతూ భారత వికాస్ పరిషత్ గత ఆరు దశాబ్దాలుగా రాజకీయాలకతీతంగా దేశ అభ్యున్నతి కోసం కార్యక్రమాలు రూపొందించుకుని అమలు చేస్తుందని వివరించారు. తులసీ యోగీష్‌చంద్ర, సేవాభారతి శ్రీవల్లి, అంకిత్ కుమార్ జైన్, సీహెచ్ చలమయ్య, రఘువీర్, భారత వికాస్ పరిషత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై సర్కస్ ఫీట్లు



బురదలో వాహనదారులు, పాదచారుల ఇక్కట్లు



నెహ్రూనగర్ 10వ లైన్ ప్రధాన సెంటర్ వద్ద గుంత

- గత కొన్నిరోజులుగా సా....గుతున్న పైప్‌లైన్ పనులు
- ప్రజలకు తప్పని తిప్పలు

నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ పైపుల పనులతో నగర వాసులకు తిప్పలు తప్పడం లేదు. నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి సంజీవయ్యనగర్ రైల్వేగేటు వరకు గతంలో ఉన్న 800ఎంఎం డయా పైపులైన్ స్థానంలో 900 ఎంఎం డయా పైపులైన్ పనులను ఇంజినీరింగ్ అధికారులు గత కొద్దిరోజులు నుంచి చేస్తున్నారు. వాటర్ ట్యాంకుల నుంచి నెహ్రూనగర్ 10వ లైన్ సెంటర్ వరకు వేగంగానే సాగాయి. కానీ ఆ సెంటర్ నుంచి పైపులైన్ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులకు తీసిన గోతులకు వర్షం కూడా తోడవ్వడంతో బురదలో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. కనీసం అడుగు తీసి అడుగెయ్యాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిన దుస్థితి. ఇక ద్విచక్రవాహన చోదకుల పరిస్థితి వర్ణనాతీతం. గుంతల పక్కన ఉన్న సన్నని బాటపై బతుకుజీవుడా అంటూ దాటాల్సిన పరిస్థితి. సంజీవయ్యనగర్, రాజీవ్‌గాంధీనగర్, శివనాగరాజు కాలనీ, రెడ్డిపాలెం నుంచి కొత్తపేట వైపు వెళ్లేందుకు, వచ్చేందుకు ఇదే ముఖ్యమైన రహదారి కావడంతో ప్రమాదమని తెలిసినా ఇటువైపుగానే వస్తున్నారు. నెహ్రూనగర్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు.. నగరంలోని పలు ప్రాంతాల్లోని కళాశాలలకు వెళ్లేందుకు ఇదే దగ్గరిదారి అవ్వడంతో విద్యార్థులు సైతం ఇటువైపుగానే వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు స్పందించి పైపులైన్ పనులను వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు.